సాక్షి కామారెడ్డి

మంగళవారం । 25 । జూలై । 2023



ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలి

తమకూ ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చూస్తూ కాయితీ లంబాడాలు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.

- 8లో ▸



డిమాండ్లను నెరవేర్చాలి

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /22.7

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బడి వేళల్లో మార్పులు

సాక్షి, కామారెడ్డి: పాఠశాలల వేళలను మారుస్తూ విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు పనిచేస్తాయని పేర్కొంది. ఈ పనివేళలు మంగళవారం నుంచే అమలులోకి రానున్నాయి.

రేపటి వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న బియ్యం పంపిణీ గడువు బుధవారంతో ముగియనుందని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిశెట్టి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెలకు సంబంధించి ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు దీనిని గమనించాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎనిమిది గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 4గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, కంప్యూటర్ సైన్స్ రెండేసి పోస్టులు, చరిత్ర, జీవశాస్త్రం, మత్స్యశాస్త్రం, గణాంకశాస్త్రం బోధించడానికి ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఆగస్టు 1న ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఇంగ్లిష్‌-2, తెలుగు, కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పీజీలో 50 శాతం మార్కులతో పాటు, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తిగలవారు 27వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, ఆగస్టు 1న కామారెడ్డి డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఎంటాయని పేర్కొన్నారు.

'రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి'



రామారెడ్డి: రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం రామారెడ్డి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

సీఐడీ ఎస్పీగా అన్యోన్య

సాక్షి, కామారెడ్డి: ఇటీవలే ఎస్పీగా పదోన్నతి పొందిన కామారెడ్డి అడిషనల్ ఎస్పీ అన్యోన్యకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయనకు సీఐడీ ఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన రిలీవ్ కానున్నారు.

మళ్లీ వాన

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో మూడు రోజుల తర్వాత సోమవారం మళ్లీ వాన మొదలైంది. జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో సాయంత్రం మొదలైన వాన రాత్రి వరకు కురుస్తూనే ఉంది. పలు ప్రాంతాలలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

నిజామాబాద్ ఆర్‌ఎంగా జానీరెడ్డి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా సోమవారం జానీరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌ఎంగా పని చేసిన ఉషాదేవి వ్యక్తిగత సెలవులపై వెళ్లడంతో ఆదిలాబాద్ ఆర్‌ఎం జానీరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలిచ్చారు. ఉషాదేవి సెలవులను పొడిగించుకోవడంతో జాన్‌రెడ్డికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు.

'గ్రామ రెవెన్యూ'.. కనుమరుగు!

జిల్లాలో వీఆర్‌ఏల విద్యార్హతల వివరాలు

విద్యార్హత	డిగ్రీ	ఇంటర్	ఎస్సెస్సీ	పదిలోపు..	నిరక్షరాస్యులు	మొత్తం
వీఆర్‌ఏలు	232	324	352	170	351	1,429



బాన్సువాడలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, సంబురాలు చేసుకుంటున్న వీఆర్‌ఏలు

తాతల కాలం నుంచి కొనసాగిన గ్రామ రెవెన్యూ వ్యవస్థ రాష్ట్రంలో కనుమరుగైనట్టే.. ఇప్పటికే గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) వ్యవస్థను రద్దు చేసి, వారిని ఇతర విభాగాల్లో సర్దుబాటు చేసిన ప్రభుత్వం.. తాజాగా వీఆర్‌ఏ వ్యవస్థనూ రద్దు చేసింది. వారికి పేస్కేల్ వర్తింపజేస్తూ ఇతర శాఖల్లో అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. దీంతో గ్రామ రెవెన్యూ వ్యవస్థ ఉనికి కోల్పోయినట్టేనని భావిస్తున్నారు. ఇక వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు లేని రెవెన్యూ వ్యవస్థ మిగిలింది. మండల స్థాయిలో తహసీల్దార్, సిబ్బంది మాత్రమే ఉండనున్నారు.

- గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు
- ఇటీవల వీఆర్‌వోల సర్దుబాటు
- ఇప్పుడు వీఆర్‌ఏల వంతు...
- జిల్లాలో 1,429 మంది వీఆర్‌ఏలకు పేస్కేల్‌తో ప్రయోజనం

సాక్షి, కామారెడ్డి: పూర్వకాలంలో గ్రామాల్లో పటేల్, పట్వారీ వ్యవస్థ ఉండేది. పట్వారీ రెవెన్యూ విధులు నిర్వహించేవారు. భూములకు సంబంధించిన పహణీ నిర్వహణతో పాటు భూమిశిస్తు వసూలు వ్యవహారాలన్నీ ఆయనే చూసేవారు. పట్వారీని కరణంగా పిలిచేవారు. వారికి సహాయకులుగా సుంకరి, మస్కూరు, నీరడి పనివారలు ఉండేవారు. చెరువులు, కుంటలు, కాలువలకు సంబంధించి నీరడి చూసుకునేవారు. సుంకరి, మస్కూరులు పటేల్, పట్వారీల వెంట ఉండి అన్ని రకాల సహాయాలు అందించేవారు.

తెలంగాణ వచ్చాక..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ భూ రికార్డుల ప్రక్షాళనపై దృష్టి పెట్టారు. భూరికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ధరణి అనే వ్యవస్థను తీసుకువచ్చారు. అంతకుముందే రికార్డుల ప్రక్షాళన ప్రక్రియ చేపట్టారు. రికార్డుల ప్రక్షాళన ప్రక్రియలో అనేక అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. తర్వాత కొంతకాలానికే వీఆర్‌వో వ్యవస్థ రద్దు చేస్తూ సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. వీఆర్‌వోలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేశారు. జిల్లాలో 178 మంది వీఆర్‌వోలు ఉండగా వారిని ఇతర విభాగాల్లోకి సర్దుబాటు చేశారు.

జిల్లాలో 1,429 మంది వీఆర్‌ఏలు ఉన్నారు. వారికి పేస్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసింది. వారిని విద్యార్హతలను బట్టి వివిధ ఉద్యోగాల్లో సర్దుబాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఏ శాఖలలో సర్దుబాటు చేస్తారన్న విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

ఎన్టీఆర్ హయాంలో..

ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అధికారం చేపట్టిన తర్వాత పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. మండల వ్యవస్థను తీసుకువచ్చారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు వ్యవహారాలను మండల పరిషత్‌లు, భూములకు సంబంధించిన వ్యవహారాలను మండల రెవెన్యూ అధికారులు(తహసీల్దార్లు) చూసుకునేలా ఏర్పాట్లు చేశారు. పట్వారీలను గ్రామ రెవెన్యూ అధికారులుగా తీసుకున్నారు. నీరడి, మస్కూరు, సుంకరిలను గ్రామ సేవకులుగా మార్చారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసిన తరువాత కూడా రెవెన్యూ వ్యవస్థలో వీఆర్‌వోలదే కీలక పాత్రగా కొనసాగింది.

'గురుకుల డిగ్రీ'.. ప్రారంభం కానట్టే!

- ప్రవేశానికి దరఖాస్తు చేసుకుంది ఏడుగురు విద్యార్థులే..
- ఇప్పటికీ సమకూరని అద్దె భవనం
- ఆలస్యం కావడంతో అయోమయం
- విద్యార్థుల సర్దుబాటుకే మొగ్గు!

సాక్షి, కామారెడ్డి: బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యనందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాకో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాలను మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరంనుంచే తరగతులు ప్రారంభించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో గురుకుల డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం అధికారులు భవనాల గురించి వెదికారు. కళాశాలకు సరిపడా సౌకర్యాలు ఉన్న భవనం ఇప్పటికీ దొరకలేదు. దీంతో కాలేజీ ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. కాగా కాలేజీ మంజూరు నాటికే డిగ్రీలో ప్రవేశాల కోసం దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. దోస్త్ గడువు ముగిసే సమయంలో గురుకుల డిగ్రీ కాలేజీ మంజూరైంది. దీనికి తోడు దరఖాస్తుల స్వీకరణకు పెద్దగా ప్రచారం కూడా జరగలేదు. అప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో డిగ్రీ సీట్ల కేటాయింపు కూడా జరగడంతో కొత్తగా మంజూరైన గురుకుల డిగ్రీ కాలేజీలో ప్రవేశాల కోసం పెద్దగా దరఖాస్తులు రాలేదు. ఏడుగురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. దీంతో ఈసారి కాలేజీని ప్రారంభించే అవకాశాలు లేవని భావిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్నవారిని ఇతర జిల్లాలలో సర్దుబాటు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

భవనాల సమస్య..

ప్రభుత్వం బీసీ వర్గాలకు నాణ్యమైన విద్య అందించేందుకోసం గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేస్తోంది. అయితే భవనాలు మంజూరు చేయకపోవడం సమస్యగా మారింది. ఇప్పటికే గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు అద్దె భవనాలలో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. కొత్తగా మంజూరైన డిగ్రీ కాలేజీకి కూడా భవనం దొరకడం లేదు. ప్రభుత్వం భవనాలను మంజూరు చేయాలని విద్యాభిమానులు కోరుతున్నారు.

కల్యాణి రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



కల్యాణి ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ఎల్లారెడ్డిరూరల్: కల్యాణి ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీటిని మంజీర నదిలోకి వదులుతున్నట్లు ఏఈ శివప్రసాద్ సోమవారం తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 120 క్యూసెక్కుల నీరు వస్తోందని, దీంతో అంతే నీటిని గేట్ల ద్వారా వదులుతున్నామని పేర్కొన్నారు.

పోచారంలోకి 1,242 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి సోమవారం 1,242 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 1,142 క్యూసెక్కుల నీరు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తోంది.



పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు

'గడీల పాలనకు చరమగీతం పాడాలి'



పంచాయతీ కార్మికులకు భోజనం వడ్డిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

భిక్కనూరు: రాష్ట్రంలో నడుస్తున్న గడీల పాలనకు చరమ గీతం పాడే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం భిక్కనూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు, సిబ్బందికి వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కరోనా సమయంలో ఎన్నో సేవలందించిన పంచాయతీ కార్మికులు, సిబ్బందికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం వారిని గోస పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు కుంట లింగారెడ్డి, బల్యాల సుదర్శన్, భీంరెడ్డి, దయాకర్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, కొట్టని స్వామి, దుర్గయ్య, ద్యాగల కిరణ్, కర్నల శ్రీనివాస్, సాజిద్, గజ్జె సురేశ్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం నేతలు బండి శ్యామ్, చిన్న భూషణం, రమేశ్, రాంచంద్రం, జావెద్, పెంటయ్య నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి

దోమకొండ: దోమకొండ మండలానికి ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేయకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం గతంలో జేఏసీ ఆధ్వర్యంలో 100 రోజులపాటు దీక్షలు చేశారన్నారు. మండలానికి కళాశాల వస్తుందని ప్రభుత్వ విప్ నమ్మించారని, కానీ ఇప్పటివరకు మంజూరు చేయించలేదని పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో ఇప్పటికే రెండు డిగ్రీ కళాశాలలు ఉండగా, మద్నూర్‌లో మరొకటి ఏర్పాటు చేస్తున్నారన్నారు. దోమకొండకు డిగ్రీ కళాశాల మంజూరు చేయించడంలో ప్రభుత్వ విప్ విఫలమయ్యారన్నారు. దోమకొండ కళాశాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు చందు, ఐరేని సందీప్, అబ్రబోయిన స్వామి, అనంతరెడ్డి, భీంరెడ్డి, సుతారి రమేశ్, సీతారం మధు, గోపాల్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ దుకాణం బంద్ చేయించాలి

- మోసాలు తప్ప వాస్తవాలు చెప్పని సీఎం
- నెల రోజుల్లో ఇళ్లు పంపిణీ చేయకపోతే పేదలకు మేమే పంచుతాం
- బీజేపీ ధర్నాలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

కామారెడ్డి టౌన్: హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం తప్ప సీఎం కేసీఆర్ వాస్తవాలు చెప్పరని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు విమర్శించారు. ప్రజలు ఇక బీఆర్‌ఎస్ దుకాణం బంద్ చేయించాలని పిలుపునిచ్చారు. అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎక్కడ పోటీ చేస్తే అక్కడ రూ. 100 కోట్లతో ఏడాది, ఆరు నెల ల్లోనే రాజభవనాలు కట్టుకుంటున్నారని, కానీ నిరుపేదలకు మాత్రం ఇళ్లు ఇయ్యడానికి మనస్సురావడం లేదని పేర్కొన్నారు. ఇళ్ల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకుంటే వందల మందికి కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. కొన్నిచోట్ల డ్రాలు తీయడం తప్ప లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించకపోవడాన్ని తప్పుపట్టారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అన్ని రాష్ట్రాల్లో ఇళ్లు కట్టించామని, తెలంగాణలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నిధులను డబుల్ బెడ్ రూం స్కీమ్‌కు మళ్లించి పేదలకు ఇవ్వడం లేదని రఘునందన్‌రావు ఆరోపించారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే పేదలకు రూ. 3లక్షలు ఇస్తామన్న హామీ ఏమయ్యిందని ప్రశ్నించారు. దళిత బంధు అంతా అవినీతేనన్నారు. ఇప్పటివరకు బీసీ బంధు ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కొత్తగా మైనారిటీలను బుజ్జగించేందుకు ముస్లిం బంధు, క్రిస్టియన్ బంధు అంటున్నారన్నారు. ఎన్నికలు రాగానే కొత్త స్కీమ్‌లు యాదికి వస్తాయని, గెలిచాక ప్రజలను మోసగించడం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ఆనవాయితీ అయ్యిందని విమర్శించారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందు హామీలు కురిపించి ప్రజల్ని అయోమయానికి గురి చేస్తారని, ప్రజలు బీఆర్‌ఎస్‌ను నమ్మవద్దని కోరారు. నెల రోజుల్లో గరీబోళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకపోతే తామే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమం కోసం బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకులు నీలం చిన్నరాజులు, ఎంజీ.వేణుగోపాల్‌గౌడ్, పైలా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థులకు నోట్ బుక్కులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. భారత సేవాశ్రమ సంఘం ప్రతినిధి వెంకటేశ్వరానంద ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు 30,000 నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రాక



పెద్దమల్లారెడ్డిలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ బృంద సభ్యులు సోమవారం సందర్శించారు. గ్రామంలో పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను, అంగన్‌వాడీ కేంద్రాలను, ఇంకుడు గుంతలను, వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మరుగు దొడ్ల వినియోగాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బృందం లీడర్ ఫయాజ్, ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధిలో కామారెడ్డి ఆదర్శం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు: రాష్ట్రంలో అభివృద్ధిలో కామారెడ్డి ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి వీధిని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా సాగుతున్నానన్నారు. సోమవారం శ్రీ సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో రూ. 78.20 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలందరికీ అవసరమైన మౌలిక వసతుల కల్పనకోసం అహర్నిశలు శ్రమించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకోవడానికి బీజేపీ, కాంగ్రెస్ నేతలు పోటీపడుతున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు సీఎం కేసీఆర్‌కు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ జనగామ శ్రీనివాస్, ఎంపీటీసీ మీనా దుర్గాబాబు, నాయకులు మాధవి బలరాం, ప్రభాకర్‌శర్మ, డాక్టర్ సత్యనారాయణ, ద్యావర లక్ష్మి, సుల్తానా, తాటికొండ బాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిద్ధరామేశ్వరనగర్‌లో నృత్యం చేస్తున్న గంప గోవర్ధన్

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్
- ప్రజావాణికి 83 వినతులు


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 83 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 52 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే కావడం గమనర్హం. మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీవో సాయన్న, ఏవో రవీందర్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం డిమాండ్



రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీష్ రావులు ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరణ ఏప్రిల్ 2023 నుంచి ప్రారంభమవుతుందని, వేతనాలు పెంచుతామని ప్రకటించిన విషయాన్ని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర శిక్ష విధులు నిర్వహిస్తున్న రాష్ట్రంలోని 21 వేలకు పైగా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజావాణికి విచ్చేశారు. వారు మాట్లాడుతూ.. విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో 15 ఏళ్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. కనీస వేతనం అమలు చేసి ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న లబానాలు

ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలి

- లబానా లంబాడా సమాజ సంఘం

గిరిజనులకు మాదిరిగానే తమను కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలని లబానా (కాయితీ) లంబాడా సమాజ సంఘం డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా సోమవారం లబాన్ లంబాడాలు కామారెడ్డి కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్సింగ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు బంతిలాల్ మాట్లాడుతూ.. లబాన్ లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నామని తెలిపారు. 1986 వరకు ఎస్టీ జాబితాలో ఉన్న తమను బీసీ జాబితాలోకి మార్చారని వాపోయారు. చెల్లప్ప కమిషన్ ఆధారంగా కాయతీ లంబాడీలకు వాల్మీకి బోయ వారితో కలిపి 10% రిజర్వేషన్లను ఇచ్చేందుకు కేంద్రానికి నివేదించినట్లు తెలిపారు. ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై ఉదయ్ శేఖర్‌లు వారిని సముదాయించారు. కలెక్టర్ వచ్చే వరకు కదిలేది లేదని మొండికేశారు. గంటకు పైగా కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం 20 మందిని లోనికి అనుమతించడంతో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు.

వైద్య కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

కామారెడ్డి టౌన్: నూతనంగా ప్రారంభించబోయే ఎంసీహెచ్ భవనంలో వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డితో పాటు నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. వైద్య కళాశాల అనుబంధగా టీచింగ్ మెడికల్ కళాశాలను పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేవలం తాత్కాలికంగా ఏడాది కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మాతాశిశు సంరక్షణ భవనంలోకి మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం సరికాదన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి కేటాయించాలన్నారు. పాత కలెక్టరేట్ భవనంలో టీచింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు తేలు శ్రీనివాస్, కుంటా లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు రవి, నరేందర్, శ్రీనివాస్, నాయకులు విపుల్, నరేందర్ తదితరులున్నారు.


ఎంసీహెచ్ భవనాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు పార్టీకి రాజీనామా చేసి సోమవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధారి బీఆర్‌ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు, జువ్వాడి గ్రామం మాజీ సర్పంచ్ చాకలి సంగయ్య, ఉప సర్పంచ్ యాదగిరి, వార్డ్ మెంబర్ మహేందర్, సీనియర్ నాయకుడు వడ్ల చంద్రం, వడ్ల స్వామి, బీజేపీ నాయకుడు స్వామి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని షబ్బీర్ అలీ కోరారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, ఎల్లారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, కామారెడ్డి జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న ఎల్లారెడ్డి నాయకులు

రైతులకు సేవలు చేయడంలో ముందుండాలి

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: రైతులకు సేవ చేయడంలో ముందుండాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పాత బాన్సువాడలో నూతనంగా నిర్మించిన సహకార సంఘం భవనాన్ని ఆయన పరిశీలించారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ..స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సహకార సంఘ భవనం అన్ని హంగులతో చూడ ముచ్చటగా నిర్మించారని అన్నారు. రైతు విత్తనం నాటినప్పటి నుంచి ధాన్యం విక్రయించే వరకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, కృష్ణారెడ్డి, పాత బాలకృష్ణ, ఎజాస్, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, జుబేర్, పాల్త్య విఠల్, జిన్న రఘు తదితరులున్నారు.


సొసైటీ భవనాన్ని పరిశీలిస్తున్న భాస్కర్‌రెడ్డి

పీఎస్‌ఆర్ పేరును తొలగించాలి

కామారెడ్డి టౌన్: బాన్సువాడ పట్టణంలో ఇటీవల అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించిన ప్రాథమిక సహకార సంఘ భవనానికి పెట్టిన పీఎస్‌ఆర్ పేరును తొలగించాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సహకార సంఘ అధికారి వసంతకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనానికి రాజకీయ నాయకుల పేర్లు పెట్టడం సబబు కాదన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి తన సొంత ఖర్చులతో భవన నిర్మాణం చేపట్టి భవనానికి పేరు పెడితే మాకేమి అభ్యంతరం లేదన్నారు. పేరును రాయించిన సొసైటీ అధ్యక్షుడు, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కాలేక్, హన్మండ్లు, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పీజీ పరీక్షల్లో 57 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన పరీక్షకు 57 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ, 2వ సెమిస్టర్, ఐఎంబీఏ 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 620 మంది విద్యార్థులకు గానూ 578 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 319 మంది విద్యార్థులకు గానూ 304 మంది హాజరు కాగా 15 మంది గైరాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు.

క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణనకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడపాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించినదని ఆర్‌ఎం జానిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులకు సంస్థ నియమనిబంధనలకు అనుసరించి ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం వారి కాలనీలలో 30మంది ప్రయాణికులు ఉన్న ఎడల వారి వద్దకే బస్సు పంపించబడుతుందన్నారు. ఆసక్తి గల వారు డిపో మేనేజర్, నిజామాబాద్-1 – 9959226016, డిపో మేనేజర్, నిజామాబాద్-2 – 9959226017, డిపో మేనేజర్, కామారెడ్డి – 9959226018ను సంప్రదించాలని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరమ శివుడి అనుగ్రహం పొందాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఐటీఐలో డీజిల్ మెకానిక్ పూర్తి చేసిన వారికి ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్‌ఎం జానిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు www.apprenticesshipindia.org లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని మెరిట్ ప్రతిపాదకన సెలెక్ట్ చేసుకుంటామన్నారు. నిజామాబాద్ రీజినల్ పరిధిలోని ఆరు డిపోలలో అవసరం మేరకు ఐటీఐ అప్రెంటిస్‌షిప్ కోసం కేటాయిస్తామన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కామారెడ్డిలో దొంగల హల్‌చల్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గంజ్‌లోని ఓ దుకాణం ప్రధాన గేటు సహా దుకాణం తలుపులకు ఉన్న తాళాలు పగలగొట్టారు. నగదు, విలువైన వస్తువులు లభించకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారుజామున యజమాని అశోక్ దుకాణం తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, విచారణ జరిపారు.



రెండు ఆలయాల్లో చోరీ...

జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న వాల్మీకి ఆలయం, హనుమాన్ ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీలను ధ్వంసం చేసి దాదాపు రూ.20వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిజామాబాద్‌కు పలు రైళ్లు రద్దు



ఖలీల్‌వాడి : సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటన చేసింది. ఈనెల 25న కర్నూల్ గుంతకల్లు–బోధన్ (07671) రైలు 26, 27, 30 తేదీల్లో 120 నిమిషాలు లేటుగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. 24 నుంచి 30 వరకు దండి–నిజామాబాద్ (11409) రైలు ముద్ఖేడ్–నిజామాబాద్, 25 వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిజామాబాద్–పండరీపూర్ (01413) రైలు నిజామాబాద్–ముద్ఖేడ్ మధ్య రద్దు చేశారు. కాచిగూడ–నిజామాబాద్ (07596), నిజామాబాద్–కాచిగూడ (07593), నాందేడ్–నిజామాబాద్ (07854) రైళ్లు 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, నిజామాబాద్–నాందేడ్ (07853) రైళ్లను నుంచి రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది.

హరితహారంలో భాగస్వాములు కావాలి


కోనాపూర్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్

బీబీపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కోనాపూర్‌లో మంత్రి కేటీఆర్ నిర్మించిన పాఠశాల ఆవరణలో కేటీఆర్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని వినతులు



కామారెడ్డి రూరల్/ఎల్లారెడ్డి రూరల్: కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేర్వేరుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే క్రమబద్ధకరించాలని కోరారు. జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దామోదర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, ఉపాధ్యక్షులు వీణ, వెంకటేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని పోషించని కొడుకు

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తండ్రి ఫిర్యాదు



మాచారెడ్డి: తనకు బుక్కెడు బువ్వ పెట్టకుండా వేధింపులకు గురిచేస్తున్న కొడుకుపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని ఓ తండ్రి అధికారులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా.. పాల్వంచ మండలం బండరామేశ్వరపల్లి గ్రామానికి చెందిన మాదాసు బాల్‌రాజుకు భార్య కొన్నేళ్ల క్రితం చనిపోగా, ఒక కుమారుడు ఉన్నాడు. ఒక్కగానొక్క కొడుకని అల్లారుముద్దుగా పెంచి, పెళ్లి చేశాడు. తాను సంపాదించిన ఆరెకరాల భూమి నుంచి కొడుకు రాజయ్య పేరిట మూడు ఎకరాలు, తన పేరిట మరో మూడెకరాలు పట్టా చేయించుకున్నాడు. ప్రస్తుతం తాను అనారోగ్యం బారిన పడ్డాననీ, ఈ సమయంలో పోషించాల్సిన కొడుకు, కోడలు, మనవడు తనను నిర్లక్ష్యం చేస్తున్నారని బాల్‌రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం వృద్ధుల సంఘానికి అందజేసిన ఫిర్యాదుప్రతులను కలెక్టర్‌తో పాటు కామారెడ్డి ఆర్డీవో, పాల్వంచ తహసీల్దార్‌లకు అందజేశారు. తన కొడుకు, కోడలు వారి పిల్లలపై చర్య తీసుకొని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

నేడు నగరంలో జాబ్ మేళా

నిజామాబాద్‌అర్బన్: నేడు జిల్లా కేంద్రంలో ఎంఎస్ఎం ల్యాబరేటరి ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఖిల్లా)లో ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఫార్మ, ఎంఎల్‌టీ, పూర్తి చేసి 60శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించలేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788604]

WANTED

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- 7993700904, 9014504770, 8977743048. [W-1002992]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-11711]

FACULTY TEACHERS

■ English Teachers's Skill Enhancing Workshop Free for MA in English Freshers Send UR Details. Ph : 9248481331. [HA-13947]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన అవధూత సంతోషి(46) అనే మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈనెల 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. ఆమె కుటుంబసభ్యులు చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కుమారుడు అక్షయ్ సోమవారం దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి


నాగవ్వ (ఫైల్)

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో శతాధిక వృద్ధురాలు తోర్తోల్ల నాగవ్వ(102) సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈమె మూడు తరాల వారసులను కళ్లారా చూసినట్లు కుటుంబీకులు తెలిపారు. అంతేకాకుండా ఈమెకు పాల పండ్లు కూడా వచ్చినట్లుగా పేర్కొన్నారు. ఈమె వారం రోజుల క్రితం వరకు తన పనులు తనే చేసుకుంటూ కాలం వెళ్లదీసినట్లు తెలిపారు. పూర్తి ఆరోగ్యంగా ఉండేదన్నారు. అయితే నాగవ్వకు ఒక కూతురు ఎల్లవ్వ కాగా ఎల్లవ్వకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. వీరిద్దరికి ఇద్దరు కొడుకుల చొప్పున ఉన్నారు. అయితే వారి మనువలకు కూడా ఇద్దరు కొడుకుల చొప్పున ఉన్నారు. వీరే మునిమనుమలు. వీరందరిని కండ్లరా చూసి నాగవ్వ మురిసిపోయినట్లు తెలిపారు.

ఆటో యజమానికి జరిమానా

కామారెడ్డి టౌన్: పట్టణ శివారులోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం ప్రాంతంలో చికెన్ వ్యర్థాలను పడేసిన ఆటో యజమానికి మున్సిపల్ అధికారులు సోమవారం భారీగా జరిమానా విధించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే, దుర్గంధం వచ్చే వ్యర్థాలను ఆటోలో తీసుకువచ్చి పట్టణానికి సమీపంలో వేయడంతో అతడికి రూ. 5వేలు జరిమానా విధించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయవద్దని సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జోగిన చిన్న రాజయ్యకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. సోమవారం ఇంటిలోని వారందరూ పొలం పనుల నిమిత్తం చేను వద్దకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లు కాలిబూడిద అయింది. దుస్తులు, నిత్యవసర సరుకులు, బీరువాలోని నగదు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులోని లక్ష్మినగర్ తండా సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడి ఒకరు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. దోమకొండకు చెందిన క్యాదరి శివకుమార్ (39) ఆదివారం కామారెడ్డిలో ఉన్న తన బావ ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి అదే రోజు రాత్రి బైక్‌పై దోమకొండకు వస్తుండగా లక్ష్మినగర్ తండా సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌కు గేదె అడ్డం వచ్చింది. దీంతో శివకుమార్ బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సలహ మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి క్యాదరి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

తలకొరివి పెట్టిన తల్లి



దోమకొండలో శివకుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించగా, తల్లి కళావతి కుమారుడుకి తలకొరివి పెట్టింది. మృతుడు శివకుమార్ ఇటీవల గ్రామంలో సొంత ఇంటి నిర్మాణం చేసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. భార్య శిల్పతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య రెండు నెలల బాలింత. కుమారుడు జన్మించిన రెండు నెలల లోపే అతడు మృతిచెందాడని కుటుంబ సభ్యులు రోధించారు.ఈ ఘటన గ్రామంలో విషాధచాయలు నింపాయి. తల్లికి కుమారుడు తల కొరివి పెట్టాల్సి ఉండగా, తల్లే కుమారుడికి తల కొరివి పెట్టిందంటూ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు



దోమకొండ: దోమకొండ మండల కేంద్రానికి చెందిన చింతల లక్ష్మినర్సవ్వ (86) సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా, కూతురు వెంకటలక్ష్మి తల్లికి తల కొరివిపెట్టారు. మృతురాలు లక్ష్మినర్సవ్వ గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భర్త బాలయ్య గతంలో కరోనాతో మృతిచెందారు. లక్ష్మినర్సవ్వ మృతిచెందగా, చిన్న కూతురు వెంకటలక్ష్మి తల్లికి తలి కొరివి పెట్టింది. ఈ ఘటన చూపరులను కన్నీటి పర్యంతం చేసింది.

పోచమ్మ ఆలయంలో చోరీ


దొంగలు పగలగొట్టిన హుండీ

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న డబ్బులను అపహరించుకపోయారు. సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడుతూ.. గత నెల రోజులుగా హుండీని తెరవలేనందున సుమారు రూ: 5వేల నుంచి 10వేల వరకు నగదు ఉంటాయని తెలిపారు. చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధురాలి ఆత్మహత్య



పిట్లం(జుక్కల్): జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధురాలు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన కటికే రుక్కవ్వ (70) గృహిణి కొన్నేళ్ల క్రితం భర్త మృతిచెందడంతో, జీవితంపై విరక్తి చెందింది. దీంతో మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యం కారణంగా ఒకరు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఓ వృద్ధురాలు అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎంటి లచ్చవ్వ (72) కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఎన్నిసార్లు ఆస్పత్రులలో చూయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు

- ఒకరికి గాయాలు


బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ శివారులోని 63వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు ముందున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా.. మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన గంగాధర్ బైక్‌పై నిజామాబాద్ వెళుతున్నాడు. మాణిక్‌భండార్ వద్ద ఆర్మూర్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతడిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ కాళ్లు, చేతులు విరిగినట్లు స్థానికులు తెలిపారు. బస్సు కింద బైక్ ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు తెలిసింది.

వ్యక్తిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని కాల్‌పోల్ గ్రామంలో బోరుబావి వాడుకునే విషయమై ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము సోమవారం తెలిపారు. బస్సీ సడ్డాకు చెందిన బోరుమోటారును ప్రకాష్ వాడుకుంటున్నాడు. పైపు పగిలిపోవడంతో నీరు వృథాగా పోతున్నాయని సడ్డా ప్రకాష్‌కు చెప్పాడు. ఈ విషయంలో వారి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ప్రకాష్ సడ్డాపై దాడిచేయడంతో స్వల్పగాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.